క్లుప్తంగా

సమస్యలపై తక్షణమే స్పందించండి

పాలకొండ రూరల్: ప్రజా సమస్యలపై సచివాలయ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని అంపిలి, అన్నవరం, గోపాలపురం గ్రామాలతో పాటు ఆయా సచివాలయాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ క్రమంలో రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, హాజరుపై ఆరా తీశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న క్రమంలో అనుసరించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో సచివాయాల పరిధిలో ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కార చర్యలపై సమీక్ష చేపట్టారు. సేవలు విస్తృతం చేసేందుకు రోజువారీ నివేదికలను సిద్ధం చేయాలన్నారు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు

కురుపాం: కురుపాం ఎమ్మెల్యే స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా కొమరాడ మండలం సోమినాయుడువలస గ్రామానికి చెందిన మోసూరు రామన్నదొర శనివారం దాఖలు చేశారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటివరకు కురుపాం నియోజకవర్గానికి సంబంధించి మూడు నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ-1, స్వతంత్ర-2 మొత్తం 3 నామినేషన్లు వచ్చాయని ఆర్‌ఓ తెలిపారు.

నేడు ఎమ్మెల్యే కళావతి ప్రచారం

వీరఘట్టం: మండలంలోని వండవ, అడారు, బిటివాడ, ఎం.వి.పురం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి ఆదివారం ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



పకీరునాయుడు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: మండలంలోని బాసూరు గ్రామ మాజీ సర్పంచ్ అల్లెన పకీరునాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. గురువారం పకీరునాయుడు అనారోగ్యంతో మరణించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పకీరునాయుడు మృతి పార్టీకి తీరని లోటు అని తెలిపారు. వీరితో పాటు పార్టీ నాయకులు దుప్పాడ పాపినాయుడు, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, కిల్లారి మోహన్, కొడెం విజయ్‌కుమార్ ఉన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి : ఆర్‌వో



విద్యుత్ అధికారులకు సూచనలిస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి తెలిపారు. స్థానిక ఐటీడీఏలో ట్రాన్స్‌కో అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. పాలకొండలోని స్ట్రాంగ్‌రూం వద్ద ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ కమీషనింగ్, పోలింగ్ ముందు రోజు పంపిణీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సమయంలో తప్పనిసరిగా విద్యుత్ సరఫరా ఉండాలని, ఎటువంటి అంతరాయం ఉండకూడదని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శత్రుచర్ల పరామర్శ



ఉపాధ్యాయుడు శివ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల

కొమరాడ: మండలంలోని గంగారేగువలస పంచాయతీ స్వామినాయుడువలస గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బొబ్బిలి శివ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు వారి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, సర్పంచ్ కోడి తిరుపతిరావు, నాయకులు కొళింగ మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గ్రామ వలంటీర్లు రాజీనామా

సీతానగరం: మండలంలోని తామరఖండి, పెదంకలాం గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందించిన వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావుకు శనివారం అందజేశారు.

జనం కదలి రాగా...

కళావతి ప్రచారం



కత్తులకవిటిలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని ఓ మహిళకు చూపించి ఓటు అభ్యర్థిస్తున్న కళావతి

వీరఘట్టం: పాలకొండ ఎమ్మెల్యే స్థానం నుంచి బరిలో నిలిచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి శనివారం చేపట్టిన ప్రచారంలో జనం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని కత్తులకవిటి, వంకాయలగెడ్డ, గంగమ్మపేట, రామాపురం, కుంబిడి, బల్లగూడ, రాయిమానుగూడ, పాలమానుగూడ, సంధిమానుగూడ, ఇల్లీసుపురం, నీలంపేట, శాంతిగూడ, గదబవలస, హుస్సేనుపురం, కొంచ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. పేదలకు సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం మనందరికు ఉందన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు హామీలతో ప్రజల్లోకి వస్తున్నాయని తిప్పి కొట్టాలన్నారు. తప్పుడు హామీలను నమ్మొద్దని పిలుపునిచ్చారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్షాలకు గుణపాఠం చెపాలని కోరారు. అంతకు ముందు కత్తులకవిటిలో దుర్గాదేవికి పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ప్రచారంలో ఎంపీపీ డి.వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, సర్పంచ్‌లు గేదెల సరోజనమ్మ, రాయిల కృష్ణ, టొంపల లక్ష్మి, మిడితాన కల్యాణి, ఎంపీటీసీ కొత్తవలస పరిమల, రౌతు రుషీకేశవరావుతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లబిల్లి సుహాసిని, పాట్నూరు లక్ష్మణరావు, నీలం సత్యంనాయుడు, మెరుగుల చంద్రమౌళీ, జంపు చంద్రశేఖర్, కొత్తవలస మనోజ్‌కుమార్, రౌతు చంద్రరావు, భోగి మణి, శంబాన శ్రీను, వైశ్యరాజు గోవిందరాజు, సొంట్యాన సింహాచలం, వారాడ శ్రీరాములనాయుడు, తాడేల వెంకటనా యుడు, నెయిగాపుల రాముడమ్మ, టొంపల సుందరరావు, బోనంగి పురుషోత్తంనాయుడు, బిడ్డిక గిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం

చినబుడ్డిడిలో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



హ్యాట్రిక్ విజయం సాధిద్దాం

● ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధిద్దామని కురుపాం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఇటిక, అంకవరం, గెడ్డతిరువాడ, చినబుడ్డిడి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె ఓటర్లను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రతిపక్షాలను ఓడించి హ్యాట్రిక్ విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. దీన్ని ఓటర్లంతా గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. జగనన్న ఐదేళ్ల పాలనలో నవరత్న పథకాలను అమలు చేసి పేదల జీవన స్థితిగతులను మెరుగుపరిచారన్నారు. ప్రతిపక్షాల నేతలు మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో నేడు మౌలిక సదుపాయాల కల్పన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రంలో పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందన్నారు. పార్టీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో కష్టించి పని చేయాలన్నారు. ఫ్యాన్ గుర్తును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. ప్రచారంలో డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, మరడాన కిశోర్, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు శతశాతం పూర్తి చేయాలి



క్షేత్ర సహాయకుల సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

పాలకొండ రూరల్: ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను శతశాతం పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా క్షేత్ర సహాయకులు పని చేయాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై శనివారం సమీక్ష చేపట్టారు. ముఖ్యంగా మస్తర్లు, పని చేపడుతున్న ప్రదేశాల్లో కొలతలు సక్రమంగా వేయాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత ప్రాతిపదికన ప్రయోజనాలు సమకూర్చే పనులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. వేసవి నేపథ్యంలో వేతనదారుల ఆరోగ్య రక్షణపై అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఉపాధి ఏపీడీ శ్రీహరి, ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నామినేషన్ నిల్

సీతంపేట: పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ఐటీడీఏలో శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వీరఘట్టంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలు

● బలమైన శక్తిగా అవతరించిన వైఎస్సార్‌సీపీ

వీరఘట్టం: గత పదేళ్లుగా వీరఘట్టం మండలంలో బలమైన శక్తిగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీరఘట్టం మేజరు పంచాయతీలో మాత్రం తగినంత ఆదరణ లేక బలహీన పడింది. 2014 - 19 మధ్య కాలంలో టీడీపీ అరాచక పాలనకు బలైపోయిన కొందరు టీడీపీ క్యాడర్ తర్వాత వరుసగా వైఎస్సార్‌సీపీలోకి చేరడంతో ప్రస్తుతం వీరఘట్టం పట్టణంలో వైఎస్సార్‌సీపీ బలమైన శక్తిగా మారింది. అంతేకాక 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. అంతేకాకుండా వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణను గత టీడీపీ ప్రభుత్వం ఓట్లు రాజకీయం చేసి రోడ్డు విస్తరణ జరగకుండా అడ్డుకుంది. అయితే స్థానిక ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌లు మాత్రం ఏనాడు ఓట్లు గూర్చి ఆలోచించలేదు. వీరఘట్టం పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించారు. రూ.5.50 కోట్లు నిధులు మంజూరు చేయించి రోడ్డు పనులు చేపట్టారు. చివరి దశలో ఉన్న ఈ రోడ్డు పనులు మరికొద్ది రోజుల్లో పూర్తి కానుండడంతో మెయిన్‌రోడ్డులో ఉన్న ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో తామంతా వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటామని చెబుతున్నారు. ఈ సారి టీడీపీ పోటీ నుండి తప్పుకుని జనసేనకు కేటాయించడంతో ప్రజల్లో స్పందన కరువైంది. శుక్రవారం ఎమ్మెల్యే కళావతి సీతంపేటలో నామినేషన్ వేయడంతో ఆమెకు మద్దతుగా వీరఘట్టం పట్టణం నుండి వేల సంఖ్యలో హాజరవ్వడంతో ప్రతిపక్ష నాయకుల్లో వణుకు మొదలైంది.

జోరుగా హోం ఓటింగ్ దరఖాస్తుల సేకరణ



నేరడి-బిలో వృద్ధుడు నుండి హోం ఓటింగ్ అనుమతి తీసుకొంటున్న ఎన్నికల అధికారులు

భామిని: ఎన్నికల సంఘం నూతనంగా అమలు చేస్తున్న హోం ఓటింగ్ దరఖాస్తుల సేకరణ జోరుగా సాగుతోంది. మండలంలో ఐదు ఎన్నికల సెక్టార్ల పరిధిలో వృద్ధుల స్థితిగతులపై విచారించి హోం ఓటింగ్‌కు అనుమతులు సేకరణ చేపట్టారు. వృద్ధులు, దివ్యాంగుల నుంచి వీటిని సేకరించి వారి ఓటు హక్కు వినియోగించుకునేలు చర్యలు చేపట్టారు. నేరడి బీ సెక్టార్ అధికారిణి, సీడీపీఓ శాంతి భవాని, బీఎల్‌ఓ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి అనుమతి పత్రాలు తీసుకున్నారు. ఓటర్ల సమ్మతి మేరకు ఇంటి వద్దకే బ్యాలెట్ పట్టుకొని వచ్చి ఓటింగ్ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సర్వేశ్వరరావు

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరమని సంబధిత శాఖ అధికారి జె.సర్వేశ్వరరావు అన్నారు. ఈ తరహా ప్రమాదాలు సంభవిస్తే వాటిని అధిగమించేక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం వర్కుషాప్ నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి నేతృత్వంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, మహిళా ఎంపవర్మెంట్ సెల్ సభ్యులకు ప్రత్యేక డెమో ద్వారా వివరించారు. విద్యుత్ గృహోపకరణాలు, గ్యాస్ పొయ్యల వాడకం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రికార్డులు సిద్ధం చేయండి

గరుగుబిల్లి: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉపాధి పనులకు సంబంధించి 2023 ఏప్రిల్ నెల నుండి మండలంలో నిర్వహించిన పనులకు సంబంధించిన రికార్డులను సామాజిక తనిఖీల కోసం సిద్ధం చేయాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ డి.రాజేంద్రరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.16.62 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి తనిఖీలను నిర్వహించాల్సి వుందన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి తనిఖీలను చేపట్టేందుకు 11 మంది డీఆర్‌పీలతో పాటు 25 నుండి 30 మంది గ్రామ స్థాయి సామాజిక తనిఖీ కార్యకర్తలను నియమించ డం జరిగిందన్నారు. ఉపాధి హామీ పనులలో అవకతవకలను నిర్వహించేందుకు ప్రతీ ఏడాది సామా జిక తనిఖీలను నిర్వహించడం జరుగుతుందన్నా రు. సమావేశంలో ఏపీఓ ఎం.గౌరీనాద్‌తో పాటు వివిధ గ్రామాల ఎఫ్ఏలు పాల్గొన్నారు.

● తీరిన తాగునీటి సమస్య



తాగునీటికి ఆధారమైన బురద నీటితో నిండి ఉన్న నేలబావి



మినీ రక్షిత మంచి నీటి పథకం ద్వారా గ్రామం వద్దనే శుద్ధమైన నీటిని సేకరిస్తున్న మహిళ

2014 ఎన్నికల్లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా రూ.2లకే 20 లీటర్ల రక్షిత తాగునీరు సరఫరా చేస్తామని టీడీపీ మేనిఫెస్టోలో పొందుపర్చింది. అధికారంలోకి వచ్చాక ప్రమాణ స్వీకారం రోజున తొలి ఐదు సంతకాల్లో మూడో సంతకం రూ.2లకే 20 లీటర్ల రక్షిత నీరు ఇస్తామని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అయితే మండలంలోని జర్న పంచాయతీ బొద్దిడి గ్రామంలో మాత్రం తాగునీటి సమస్య పరిష్కరించలేదు. దీంతో గ్రామ సమీపంలోని నేలబావి నీటిపైనే ఆధారపడి తాగునీటి అవసరాలు తీర్చుకునేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2020లో ఆ గ్రామంలో మినీ రక్షిత నీటి పథకం ఏర్పాటు చేసి కాలనీలకు ట్యాప్ కనెక్షన్లు ఇచ్చి తాగునీటి సరఫరా చేపట్టింది. గ్రామంలో తాగునీటి సమస్య తీరింది.

– గుమ్మలక్ష్మీపురం

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



బురదవెంకటాపురంలో ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గరుగుబిల్లి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. మండలంలోని బురదవెంకటాపురం గ్రామంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహనా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంగరాజు ఆదేశాల మేరకు గ్రామాలలో ఎన్నికలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని వివరించారు. స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది వైడి.దొర, జి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఏకలవ్య ప్రవేశ పరీక్ష



సీతంపేట: ప్రవేశపరీక్షను పరిశీలిస్తున్న డీడీ అన్నదొర



గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 2024 – 25వ విద్యాసంవత్సరంలో ఆయా తరగతుల్లో ప్రవేశాల నిమిత్తం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు ప్రిన్సిపాల్, ఎస్.పెంటన్న, అబ్జర్వర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు 541 మంది విద్యార్థులకుగాను 511 మంది, 7వ తరగతిలో ప్రవేశ పరీక్షకు75 మంది హాజరుకావాల్సి ఉండగా 65 మంది, 8వ తరగతిలో ప్రవేశ పరీక్షకు 60 మందికి 50 మంది, 9వ తరగతిలో ప్రవేశాలకు 26 మందికి 23 మంది విద్యార్థులకు హాజరైనట్టు చెప్పారు. భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ యుగంధర్ పర్యవేక్షించారు.

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల భామిని, మెళియాపుట్టి మండలాల్లో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతుల ప్రవేశాలకు రాత పరీక్ష స్థానిక బాలిక గిరిజన గురుకుల పాఠశాలలో ప్రశాంతంగా శనివారం జరిగింది. ఐటీడీఏ డిప్యూటీడైరెక్టర్ అన్నదొర పరిశీలించారు. 490 మంది విద్యార్థులకుగాను 451 మంది హాజరయ్యారు. గురుకులం సెల్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాళ్లు కె.సురేష్, తిరుపతిరాజు పర్యవేక్షించారు.



ఒకప్పుడు నీలానగరం పాఠశాల దుస్థితి



నాడు-నేడులో అందంగా ముస్తాబైన నీలానగరం పాఠశాల

● కొంగొత్త అందాలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ బడుల రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా బడులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీర్చిదిద్దింది. వీరఘట్టం మండలంలోని నీలానగరం పాఠశాల ప్రాంగణం టీడీపీ హయాంలో దయనీయంగా ఉండేది. నేడు దాని రూపురేఖలే సమూలంగా మారిపోయాయి. మొదటి విడత నాడు - నేడు పనుల్లో భాగంగా రూ.20లక్షలతో అందంగా ముస్తాబై చిన్నారులను ఆకట్టుకుంటోంది.

– వీరఘట్టం

ఓటమి భయంతో సంధ్యారాణికి మతిభ్రమించింది

పాచిపెంట: ప్రజా క్షేత్రంలో తానెప్పుడూ గెలవలేనని నిర్ధారణకు వచ్చి, ఓటమి భయంతోనే సంధ్యారాణి మతిభ్రమించిందని ఎంపీపీ బద్నాన ప్రమీల విమర్శించారు. పాచిపెంట మండల కేంద్రంలో శనివారం ఆమె మాట్లాడుతూ.. ప్రజాభిమానంతో ప్రతీ ఎన్నికల్లో గెలుస్తున్న రాజన్నదొరను, ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక సంధ్యారాణి విమర్శించడం సిగ్గుచేటన్నారు. టీడీపీ పాలనలో ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో చెప్పకుండా నియోజకరవ్గ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేసిన రాజన్నదొరను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పనులు చేయకుండా శంకుస్థాపనల పేరుతో కొబ్బరికాయలు కొట్టడం తప్ప టీడీపీ నాయకులు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. శిలాఫలకాలు వేసి పనులు పూర్తయిపోయినట్లు ప్రచారం చేసుకోవడం శోచనీయమన్నారు. రాజన్నదొర హయాంలో పెద్దగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం, సాలూరులో వంద పడకల ఆస్పత్రి, కందులపదం వంతెన నిర్మాణం చేపడితే వాటిని మేమే చేశామని సంధ్యారాణి బీరాలు పలకడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజలకు మంచి చేయడమే రాజన్నదొర అజెండా అని, అందుకే ప్రతి ఎన్నికల్లో ప్రజాశీర్వాదంతో ఆయన విజయడంఖా మోగిస్తున్నారని పేర్కొన్నారు. సొంత పార్టీలో నాయకులే సంధ్యారాణిని నమ్మే స్థితిలో లేరని, ఇంక ప్రజలు ఆమెను ఎలా నమ్ముతారని అన్నారు. వడదెబ్బకు గురై రాజన్నదొరపై తప్పుడు మాటలు మాట్లాడి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.